నాగర్‌కర్నూల్‌లో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కనుల పండువగా కల్యాణం

నాగర్‌కర్నూల్, జూలై 16 : నాగర్‌కర్నూల్ పట్టణంలోని చండీయాగ వేడుకల్లో భాగంగా మంగళవారం సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ వేడుక కనుల పండువగా నిర్వహించారు. ఆది దంపతుల సుపుత్రుడు సుబ్రహ్మణ్యస్వామి ఆరాధన వల్ల నేత్ర రోగాలు, చర్మవ్యాధులు తగ్గుతాయని, వివాహంకాని వారికి వివాహం జరిగి, సత్సంతాన సౌభాగ్యం కలిగి ఆయురారోగ్య ఐశ్వరాలతో వర్ధిల్లుతారని కృష్ణజ్యోతి స్వరూపానందస్వామి పేర్కొన్నారు. యాగ కార్యక్రమాల్లో భాగంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంతానం కలగని వారికి పలు రకాల కాలసర్ప దోషం, కుజ దోషం ఉన్న వారు ప్రత్యేకంగా సర్పసూక్త సహిత సంతాన గోపాల హోమాలు, మనుసూక్త హోమాలు, సుబ్రహ్మణ్యస్వామి వారి హోమాలు యాగశాలలో సామూహికంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో భాగంగా బుధవారం చండీ సహిత శ్రీరుద్ర హోమాలను సామూహికంగా నిర్వహించనున్నారు. సాయంత్రం వైభవంగా ఉమామహేశ్వర కల్యాణ మహోత్సావన్ని నిర్వహించనున్నట్లు స్వామీజీ తెలిపారు.

కులమతాలకతీతంగా మొహర్రం



ఊట్కూర్‌లో హసన్, హుసేన్ పీర్లను దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

- కర్ణాటక మహారాష్ట్ర నుంచి తరలివచ్చిన భక్తులు
- హసన్, హుసేన్ పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు

ఊట్కూర్, జూలై 16 : త్యాగానికి ప్రతీకగా, కులమతాలకతీతంగా జరుపుకొనే మొహర్రం వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం ఊట్కూర్‌లోని హసన్, హుసేన్ పీర్ల మసీదుకు బారులుతీరారు. రాష్ట్ర ప్రజలే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు గొర్రెలు, మేకలతో కందూర్లు నిర్వహించి హసన్, హుసేన్ పీర్లకు నైవేద్యం సమర్పించారు. మసీదు పరిసర ప్రాంతంలో భక్తులు సహఫంక్తి భోజనాలు చేశారు. ఎంపీడీవో ధనుంజయగౌడ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. జాతరలో గాజులు, ఆటబొమ్మలు, మిఠాయి, తినుబండార దుకాణాలను చిరు వ్యాపారులు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జాయింట్ వీల్, ఇతర ఆటలతో చిన్నాపెద్ద తేడాలేకుండా సరదాగా గడిపారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రధాన కూడళ్లలో ప్రత్యేక పోలీసు బలగాలతో పర్యవేక్షణ చేపట్టారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాలను పోలీసులు మళ్లించారు. పేట డీఎస్పీ లింగయ్య గ్రామాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జీపీ కార్మికులకు వేతనాలొచ్చాయ్..

- వనపర్తి జిల్లాకు రూ.కోటీ 35 లక్షలు విడుదల
- మే వరకు చెల్లించనున్న జీతాలు

వనపర్తి, జూలై 16 (నమస్తే తెలంగాణ) : గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు ఎట్టకేలకు ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. దాదాపు మూడు నుంచి ఎనిమిది నెలలుగా జీతాలకు జీపీల్లో నిధులు లేకుండా పోయాయి. దీంతో ఇంతకాలం కార్మికులు జీతాలు లేక ఇబ్బందులు పడ్డారు. చివరకు ఆందోళనలు చేపట్టడంతో కార్మికుల జీతాల వరకు సర్కారు నిధులను సమకూర్చింది. ప్రస్తుతం మే నెల వరకు కార్మికులకు ఎలాంటి పెండింగ్ లేకుండా నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. కొత్తగా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జీపీలకు నిధులు మంజూరు చేయకపోవడంతో చిన్న, మధ్యస్తంగా ఉండే జీపీల్లో డబ్బులు లేక కార్మికుల జీతాలకు కూడా కష్టమైంది. ఈ క్రమంలో జిల్లాకు సంబంధించి రూ.కోటీ 35లక్షలు ఎస్ఎఫ్‌సీ ద్వారా ప్రభుత్వం కార్మికుల వేతనాల కోసం విడుదల చేసింది. వీటిని ఆయా గ్రామ పంచాయతీల వారీగా పెండింగ్ జీతాలను పరిశీలించి నిధులను పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలుండగా వీటిలో దాదాపు 1,060మంది వరకు మల్టీపర్పస్ వర్కర్స్ పనిచేస్తున్నారు. అయితే, జిల్లాలో కొన్ని జీపీల్లో మాత్రమే జీతాలకు డబ్బులుండడంతో ఎక్కువ జీపీల్లో నిధుల కొరత ఏర్పడింది. నిధుల రాకతో వచ్చే రెండు రోజుల్లో ఆయా జీపీల ఖాతాల్లో డబ్బులను జమ చేసిన అనంతరం పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఎస్టీవోలో చెక్కులను కార్మికుల అకౌంట్లకు చేరవేయాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో జీతాలు రాక కొన్ని గ్రామ పంచాయతీల్లో కార్మికులు ఈ కొలువులు మాకొద్దంటూ తప్పుకున్న పరిస్థితులున్నాయి. ఇదిలా ఉంటే,ఆయా జీపీల ద్వారా ఇంతకు ముందే అనేక పనులు చేసిన బిల్లులు మాత్రం పెండింగ్‌లోనే నిలిచి పోతున్నాయి. దాదాపు 8నెలలకు ముందు నుంచి పనులు చేసి రికార్డులను సహితం పూర్తి చేశారు. పెండింగ్ బిల్లుల వైపు సర్కార్ కన్నెత్తి చూసే పరిస్థితి కనిపించడం లేదు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో పెండింగ్ బిల్లులను చెల్లించాలని తాజా మాజీ సర్పంచులు సహితం ధర్నాలుచేసి ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నారు.

వీధులు శుభ్రం చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు (ఫైల్)

మే నెల వరకు వేతనాలు

జిల్లాలోని వివిధ గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న కార్మికుల జీతాలకు సరిపడా నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. రెండు రోజుల్లో జీపీల ద్వారా కార్మికుల అకౌంట్లలో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటాం. రూ.కోటీ 35 లక్షల 47 వేలు వచ్చాయి. మే నెల వరకు కార్మికులకు పెండింగ్ లేకుండా మొత్తం వేతనాలు చెల్లిస్తాం.

– రఘునాథ్‌రెడ్డి, డీఎల్‌పీవో, వనపర్తి జిల్లా

ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి నీటిని విడుదల చేయడంతో కాల్వ వెంట పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

పాముల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

జడ్చర్ల టౌన్, జూలై 16 : ప్రకృతిలో పాములు సైతం ఓ భాగమేనని, పర్యావరణ సమతుల్యతకు ప్రముఖ పాత్ర పోషిస్తాయని జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్య అన్నారు. ప్రపంచ పాముల దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఉదయ మెమోరియల్ హైస్కూల్, న్యూ సన్‌రైజ్ హైస్కూల్‌లో పాముల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పాములను ప్రదర్శిస్తూ పాములను గురించి విద్యార్థులకు వివరించారు. అదే విధంగా పాములను విద్యార్థులతో పట్టించి భయాన్ని తొలగింపజేశారు. సందర్భంగా సదాశివయ్య మాట్లాడారు. పర్యావరణంలో పాముల పాత్ర ముఖ్యమైందన్నారు. పవర్‌పాయింట్ ప్రజెన్‌టేషన్ ద్వారా పాములలో విషసహిత, విషరహిత, అర్ధ విషసర్పాలను గురించి వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్లు వీణా శివకుమార్, అయూబ్, ఉపాధ్యాయులు రామనాథ్, కీర్తన, కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో రూ.36 లక్షలు చోరీ

జడ్చర్ల, జూలై 16 : ఆర్టీసీ బస్సులో రూ.36 లక్షలు చోరీకి గురైన ఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకున్నది. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి కథనం మేరకు.. హైదరాబాద్ ట్రాన్స్‌కో డిపార్ట్‌మెంట్‌లో దామోదర్ విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే, కర్నూల్‌లో ఉంటున్న చెల్లెలి అవసరం నిమిత్తం తన పీఎఫ్, జీపీఎఫ్ డబ్బుల నుంచి రూ.36 లక్షలు తీసుకొని హైదరాబాద్‌లోని జేబీఎస్ బస్టాండ్‌లో పికెట్ డిపోకు చెందిన (టీఎస్09జెడ్7840) బస్సులో ఎక్కాడు. ఈ బస్సు హైదరాబాద్ నుంచి కడప వెళ్తున్నది. డబ్బులు ఉన్న బ్యాగును సీటుపై ఉన్న క్యాబిన్‌లో పెట్టాడు. జడ్చర్ల బస్టాండ్‌లో టీ కోసం పది నిమిషాలు బస్సును నిలుపగా.. దామోదర్ టిఫిన్ చేయడానికి బ్యాగు తీసుకొని కిందకు దిగాడు. బ్యాగు బరువులో తేడా అనిపించడంతో తెరిచి చూడగా.. అందులో నాలుగు అరలీటర్ వాటర్ బాటిళ్లు దర్శనమిచ్చాయి. గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు అపహరించినట్లు గుర్తించిన దామోదర్ జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. బస్సులోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. అయితే, బస్సులో ఒక వ్యక్తి అటూఇటూ అనుమానాస్పదంగా తిరిగినట్లు బాధితుడు తెలిపాడు. దామోదర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

తైక్వాండో పోటీలకు అన్నాచెల్లెలు

వనపర్తి టౌన్, జూలై 16: జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో నిర్వహించిన తైక్వాండో జిల్లాస్థాయి పోటీల్లో సబ్ జూనియర్ బాలుర, బాలికల విభాగంలో జిల్లా కేంద్రానికి చెందిన అన్నాచెల్లెలు లోకనాథ్, యశ్విపాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు మాస్టర్ రవికుమార్ తెలిపారు. ఈనెల 19, 20, 21 తేదీల్లో మంచిర్యాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

చెట్టు నరికినందుకు జరిమానా

అచ్చంపేట టౌన్, జూలై 16 : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిని అనుసరించి ఉన్న దుకాణాల వద్ద ఓ చెట్టును నరికివేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో ఈ మొక్కను నాటగా పెరిగి పెద్దయింది. అయితే సమీపంలోని దుకాణంలో పనిచేస్తున్న పర్వతాలు అనే వ్యక్తి మంగళవారం ఒక చెట్టును కొట్టేశాడు. ఈ విషయం మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ దృష్టికి వెళ్లగా.. అతడి ఆదేశాల మేరకు పర్వతాలుకు రూ.4 వేల జరిమానా విధించినట్లు సిబ్బంది తెలిపారు. అలాగే కొట్టేసిన చెట్టు స్థానంలో మరో మొక్క నాటాలని సూచించారు. ఎవరైనా చెట్లను కొట్టేస్తే తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్యదర్శుల బదిలీల్లో అవకతవకలు!

- అధికార పార్టీ కనుసన్నల్లోనే బదిలీలు

మహబూబ్‌నగర్, జూలై 16 : మహబూబ్‌నగర్ జిల్లాలో నిన్న జరిగిన పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో భారీగా అవకతవకలు జరుగుతున్నాయని తెలిసింది. గ్రామాల్లో అభివృద్ధి కోసం పనిచేయాల్సిన పంచాయతీ కార్యదర్శులు తమకు నచ్చిన గ్రామంలో పోస్టింగ్ కోసం పైరవీలు చేస్తున్నారు. కొంతమంది అధికారులకు డబ్బులిచ్చి నచ్చిన ప్లేస్ (గ్రామాన్ని) తీసుకుంటే కొంతమంది అధికార పార్టీ ఎమ్మెల్యేల రెకమండేషన్లు పెట్టి నచ్చిన స్థానాలు పొందుతున్నారు. కొన్ని పోస్టులను బ్లాక్ చేయించి మరీ ప్లేస్ తీసుకున్నారు. ఇక్కడ గమనించదగ్గ విషయం ఏమిటంటే జిల్లా అధికారులు(సీఈవో,డీపీవో, డీఎల్‌పీవో) ఒక్కో కార్యదర్శిని లోపలికి పిలిపించుకొని నువ్వు బదిలీ పెట్టుకున్న విలేజ్ బ్లాక్‌లో ఉంది. ఎమ్మెల్యే కలెక్టర్‌కి నోటిఫై ఇచ్చారు, నీవు ఆ విలేజ్ తీసుకున్న కూడా నీకే ప్రమాదమని భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా సస్పెండ్ అవుతావ్ ఎందుకు అని హెచ్చరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీనియార్టీ లిస్టు పట్టించుకోకుండా ఇష్టారీతిన బదిలీలు జరిగాయని, ఈ మాత్రం దానికి ఆప్షన్‌పామ్స్ ఇంత హడావిడి ఎందుకు చేశారో అర్థం కాదని పలువురు కార్యదర్శులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కుక్కల దాడిలో 60 గొర్రె పిల్లలు మృతి

చిన్నంబావి, జూలై 16: కుక్కల దాడిలో 60 గొర్రె పిల్లలు మృతిచెందిన ఘటన మండలంలోని మియాపురంలో మంగళవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన జింకల బీరయ్య, నడిపి అల్లోజీ బుచ్చన్న, చిన్న బీరయ్య తమకు కలిగిన గొర్రె పిల్లలను వలలో వదిలి రోజుమాదిరిగా మంగళవారం ఉదయం గొర్రెల మందను అటవీ ప్రాంతానికి మేపేందుకు తీసుకెళ్లారు. వలలో ఉన్న 60 గొర్రె పిల్లలపై ఒక్కసారిగా కుక్కలు దాడి చేయడంతో మృతిచెందాయి. సాయంత్రం గొర్రెల మందతో వచ్చిన బాధితులు మృతిచెందిన గొర్రె పిల్లలను చూసి బోరున విలపించారు. ఈ దాడిలో దాదాపు రూ.3.60లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

సంక్షిప్త వార్తలు

స్విగ్గీ, జొమాటోలో మద్యం డోర్ డెలివరీ!

న్యూఢిల్లీ, జూలై 16: నచ్చిన ఫుడ్‌ను స్విగ్గీ, జొమాటోలలో తెప్పించుకున్నట్టే.. ఇకపై మద్యాన్ని (పరిమిత స్థాయిలో) కూడా డోర్ డెలివరీ ద్వారా తెప్పించుకునే రోజు త్వరలో రాబోతున్నది. మనకు నచ్చిన మద్యం బ్రాండ్‌ను ఆన్‌లైన్ యాప్‌లో ఆర్డర్ చేసి పొందవచ్చు! న్యూఢిల్లీ, కర్ణాటక, హర్యానా, పంజాబ్, తమిళనాడు, గోవా, కేరళలలో పైలట్ ప్రాజెక్ట్ కింద అమలుజేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ-కామర్స్ సంస్థలతో మద్యం తయారీ సంస్థలు చర్చలు జరుపుతున్నాయని పరిశ్రమ వర్గాలు మంగళవారం మీడియాకు వెల్లడించాయి.

భారత మార్కెట్‌లోకి ఒబెసిటీ డ్రగ్ టర్‌జెపటైడ్!

న్యూఢిల్లీ, జూలై 16: బరువు తగ్గటంలో అద్భుత ఔషధంగా భావిస్తున్న 'టర్‌జెపటైడ్' ఔషధం.. త్వరలో భారత్‌లోనూ అందుబాటులోకి రాబోతున్నది. భారత్‌లో ఈ ఔషధం అమ్మకాలకు సంబంధించి ఫార్మా కంపెనీ 'ఇలి లిల్లీ'కి కేంద్రం త్వరలోనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నది. ఈ ఔషధాన్ని ఇండియాలో టైప్-2 డయాబెటిస్ రోగుల చికిత్స కోసం ప్రధానంగా వాడాలని సూచిస్తున్నా, ఒబెసిటీతో బాధపడుతున్న వారికి దీనిని ఉపయోగించవచ్చునని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ ఔషధాన్ని పెద్ద మొత్తంలో తీసుకున్న రోగుల్లో సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉన్నాయని ప్రపంచవ్యాప్తంగా జరిగిన క్లినికల్ ట్రయల్స్ చెబుతున్నాయి. భారత్‌లోని డ్రగ్ రెగ్యులేటరీ నిపుణుల కమిటీ కొద్ది రోజుల క్రితం 'టర్‌జెపటైడ్' ఔషధం అమ్మకాలకు ప్రాథమికంగా ఆమోదం తెలిపినట్టు సమాచారం.

అనారోగ్యకర ఆహారాన్ని నిషేధించండి: యూజీసీ

న్యూఢిల్లీ: ఉన్నత విద్యా సంస్థలలో అనారోగ్యకరమైన ఆహార పదార్థాల అమ్మకాన్ని నిషేధించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుతం దేశంలో అనారోగ్యకరమైన ఆహార అలవాట్ల కారణంగానే ప్రతి నలుగురిలో ఒకరు ఊబకాయం, మధుమేహం వంటి వ్యాధులతో బాధపడుతున్నారని ఐసీఎంఆర్ నివేదికలో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. వీటితో పాటు పలు అసంక్రమిత వ్యాధులకు కూడా ఇవి హేతువుగా మారుతున్నాయని తెలిపింది.

'డ్యూటీలో ముస్లింలు గడ్డంతో ఉండటం తప్పుకాదు'

చెన్నై: మతాచారాలకు అనుగుణంగా గడ్డం కలిగి ఉండటం తప్పేమీ కాదని, అలా ఉన్న పోలీసులపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు చేపట్టవద్దని మద్రాస్ హైకోర్టు తమిళనాడు పోలీస్ శాఖను ఆదేశించింది. ఈ సందర్భంగా న్యాయస్థానం 1957 మద్రాస్ పోలీస్ గెజిట్ 1957ను ప్రస్తావిస్తూ ముస్లింలు విధి నిర్వహణలో గడ్డాలతో ఉండవచ్చునని, అయితే కత్తిరించిన, చక్కనైన గెడ్డాలతో ఉండాలని ఆదేశించింది. మక్కా నుంచి వచ్చిన తర్వాత గెడ్డంతో డ్యూటీకి హాజరైన ఒక కానిస్టేబుల్‌పై అధికారులు చర్య తీసుకోవడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు గడ్డంతో విధులకు హాజరవ్వటంలో ఎలాంటి తప్పులేదని స్పష్టం చేశారు.

పవిత్ర సరస్సు వద్ద అక్రమంగా ఆలయం

డెహ్రాడూన్, జూలై 16: ఉత్తరాఖండ్‌లోని సుధేర్‌దుంగ నది లోయలో స్వయం ప్రకటిత బాబా చైతన్య ఆకాశ్ అక్రమంగా గుడి నిర్మించారని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక పవిత్ర దేవి కుండ్ సరస్సులో స్నానం చేసి ఆయన దాన్ని అపవిత్రం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల కథనం ప్రకారం చైతన్య ఆకాశ్ కొందరు స్థానికులను సముదాయించి వారి సాయంతో సున్నిత పర్యావరణ జోన్‌లో ఆలయాన్ని నిర్మించారు. కలలో దేవుడిచ్చిన ఆదేశాల మేరకే దాన్ని నిర్మించినట్టు ఆయన చెప్తున్నారు. గ్రామస్థుల ఫిర్యాదుపై భాగేశ్వర్ జిల్లా మెజిస్ట్రేట్ పోలీస్ దర్యాప్తుకు ఆదేశించారు.

సేఫ్ జోన్‌పై ఇజ్రాయెల్ దాడి..60 మంది మృతి

జెరూసలేం: దక్షిణ, మధ్య గాజా ప్రాంతాలపై సోమవారం రాత్రి నుంచి ఇజ్రాయెల్ సైన్యం చేపట్టిన వైమానిక దాడుల్లో 60 మందికిపైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. వేలాదిమంది పాలస్తీనా పౌరులు ఆశ్రయం పొందిన 'సేఫ్ జోన్'లోని టెంట్లను సైతం ఇజ్రాయెల్ సైన్యం లక్ష్యంగా చేసుకుంది. మంగళవారం ఖాన్‌యూనిస్ దక్షిణ ప్రాంతంపై బాంబుల మోత మోగించింది. శరణార్థుల కోసం ఏర్పాటుచేసిన టెంట్లను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుందని, దీంతో ఇక్కడ 17 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని నాజర్ దవాఖాన వర్గాలు ప్రకటించాయి. ఖాన్ యూనిస్ పశ్చిమ యూనిట్ నావల్ కమాండర్‌ను లక్ష్యంగా చేసుకొని మాత్రమే బాంబు దాడులు చేపట్టామని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది.

మళ్లీ చలో ఢిల్లీ

మరోసారి ఢిల్లీ ర్యాలీకి సిద్ధమైన రైతు సంఘాలు

శంభు వద్ద బారికేడ్లను తొలగించగానే ముందుకు

డిమాండ్లు సాధించే వరకు ఉద్యమం ఆపేది లేదు

బీకేయూ నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ స్పష్టీకరణ

చండీగఢ్/ఛత్రపతి శంభాజీనగర్, జూలై 16: దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతుల 'ఢిల్లీ చలో' సందర్భంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో హర్యానాలో అంబాలా సమీపంలోని శంభు సరిహద్దు వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్లు, ఇతర దిగ్బంధనాలను తొలగించిన తర్వాత.. మరోసారి ఢిల్లీకి ర్యాలీ చేపట్టేందుకు రైతు సంఘాలు సిద్ధమయ్యాయి. శంభు సరిహద్దు వద్ద జాతీయ రహదారిని తెరిచిన వెంటనే రైతులు మళ్లీ చలో ఢిల్లీ చేపడుతారని భారతీయ కిసాన్ యూనియన్ ఏక్తా సిద్ధూపూర్, సంయుక్త కిసాన్ మోర్చా(నాన్ పొలిటికల్) నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ మంగళవారం వెల్లడించారు. పంటలకు కనీస మద్దతు ధర, ఇతర డిమాండ్ల పరిష్కారం అయ్యేంత వరకు రైతాంగ ఉద్యమం ఆగేది లేదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రయాణికుల అసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని శంభు సరిహద్దు వద్ద రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్లను వారం రోజుల్లో తొలగించాలని పంజాబ్-హర్యానా హైకోర్టు ఇటీవల హర్యానా ప్రభుత్వాన్ని ఆదేశించిన నేపథ్యంలో దల్లేవాల్ ఈ మేరకు ప్రకటన చేశారు. ఫిబ్రవరిలో ఎస్కేఎం(నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా(కేఎంఎం) ఆధ్వర్యంలో రైతులు చేపట్టిన 'ఢిల్లీ చలో'ను పోలీసులు పంజాబ్-హర్యానాలోని శంభు సరిహద్దు వద్ద

అడ్డుకోవడంతో ఆ నెల 13 నుంచి రైతులు అక్కడే బైఠాయించి ఆందోళనలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

జంతర్‌మంతర్ లేదా రామ్‌లీలా మైదానంలో..

ర్యాలీగా ఢిల్లీ చేరిన తర్వాత జంతర్‌మంతర్ లేదా రామ్‌లీలా మైదానంలో శాంతియుత ఆందోళనలు కొనసాగిస్తామని జగ్జిత్ సింగ్ దల్లేవాల్ వెల్లడించారు. బారికేడ్ల తర్వాత తాము కొనసాగించే ర్యాలీని మళ్లీ అడ్డుకొన్నా, రోడ్డును దిగ్బంధించినా ప్రభుత్వానిదే బాధ్యత అని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ ఏడాది మార్చిలో ఆందోళనల సందర్భంగా పోలీసులు అరెస్టు చేసిన నవదీప్ సింగ్‌కు సంఘీభావంగా బుధ, గురువారాల్లో శాంతియుత ఆందోళనలు చేపడుతామని తెలిపారు. నవదీప్ సింగ్‌పై పోలీసులు అల్లర్లు, హత్యాయత్నం వంటి తీవ్రమైన అభియోగాలు మోపారు. హైకోర్టు ఆదేశాలను హర్యానా ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయడంపై దల్లేవాల్ స్పందిస్తూ.. రోడ్డును బ్లాక్ చేసింది ప్రభుత్వమేనని, రైతులు కాదని అన్నారు. ఫిబ్రవరిలో రైతులు, పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణల్లో మరణించిన రైతు శుభకరణ్ సింగ్ మృతిపై దర్యాప్తునకు ఏర్పాటు చేసిన కమిటీపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.

ఎంఎస్పీ పెంచక ఇబ్బందుల్లో చక్కెర పరిశ్రమ

కేంద్ర ప్రభుత్వం గత ఐదేండ్లుగా మద్దతు ధరను పెంచకపోవడంతో దేశంలోని చక్కెర పరిశ్రమ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని షుగర్ యూనిట్స్ ఫెడరేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ లిమిటెడ్ డైరెక్టర్ జైప్రకాశ్ దండేగోంకర్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కేంద్రం త్వరితగతిన నిర్ణయాలు తీసుకోకపోవడంతో షుగర్ ఇండస్ట్రీలో వర్కింగ్ క్యాపిటల్‌లో స్వల్ప మార్జిన్లు, అప్పులు వంటి సమస్యలు మళ్లీ తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం చెరకు ఎఫ్ఆర్‌పీని మూడుసార్లు పెంచిందని, అయితే చక్కెరకు ఎంఎస్పీని పెంచలేదని పేర్కొన్నారు. గత ఐదేండ్లుగా అన్ని రాష్ట్రాల ఫెడరేషన్లు డిమాండ్ చేస్తున్నా, ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన లేదని విమర్శించారు. చెరకు, రవాణా, లేబర్ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో చక్కెర ఉత్పత్తి ఖర్చుగా కేజీకి కనీసం రూ.41 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఒమన్ తీరంలో ఓడ బోల్తా

- 16 మంది ఆచూకీ గల్లంతు
- వీరిలో 13 మంది భారతీయులు

మస్కట్, జూలై 16: ఒమన్ తీరంలో చమురు ట్యాంకర్లతో ప్రయాణిస్తున్న ప్రెస్టీజ్ ఫాల్కన్ అనే ఓడ సోమవారం బోల్తా పడింది. ఈ ఓడలో ఉన్న 16 మంది సిబ్బంది గల్లంతయ్యారని ఒమన్ మారిటైమ్ సెక్యూరిటీ సెంటర్(ఎంఎస్‌సీ) తెలిపింది. ఇందులో 13 మంది భారతీయులు కాగా, మరో ముగ్గురు శ్రీలంకకు చెందిన వారుగా గుర్తించారు. వీరి ఆచూకీ కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నది. కొమొరోస్‌కు చెందిన ఈ ఓడ యెమన్‌లోని ఓడరేవు నగరమైన ఏడెన్‌కు వెళ్తున్నట్టు తెలిసింది. రాయ్ మద్రకహ్‌కు ఆగ్నేయం వైపు 25 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన జరిగింది. ఓడ బోల్తా పడటానికి కారణం ఇంకా తెలియరాలేదు. ఓడ ఆచూకీ కోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయి.

మస్కట్‌లో మసీదు వద్ద కాల్పులు.. భారతీయుడు మృతి

మసీదు లక్ష్యంగా ఒమన్ రాజధాని మస్కట్‌లో దుండగులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు మరణించగా, 50 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో ఒకరు భారతీయుడు, నలుగురు పాకిస్థానీయులు ఉన్నారు. కాల్పులకు పాల్పడ్డ వారిలో ముగ్గురు దుండగులను కాల్చి చంపినట్టు పోలీసులు తెలిపారు. వాడీ కబీర్ ప్రాంతంలోని ఇమామ్ అలీ మసీద్ బయట సోమవారం రాత్రి స్థానికులు మతపరమైన వేడుక జరుపుకుంటుండగా ఈ కాల్పులు జరిగాయి. మృతి చెందిన భారతీయుని కుటుంబానికి సహాయ సహకారాలను అందించనున్నట్టు భారత రాయబార కార్యాలయం పేర్కొంది.

కూలీలుగా వేషం మార్చి.. దొంగల ముఠా ఆట కట్టించి

- పుణె పోలీసుల రహస్య ఆపరేషన్
- చోరీకి గురైన 100 బైకులు స్వాధీనం

ముంబై, జూలై 16: వ్యవసాయ కూలీలుగా మారు వేషం ధరించిన పోలీసులు, పుణె చుట్టుపక్కల వాహనాల్ని దొంగలిస్తున్న ముఠాను అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. గత ఏడాది మార్చి-ఏప్రిల్‌లో పుణె పోలీస్ క్రైం బ్రాంచ్‌లోని ఏడుగురు సభ్యులు రహస్య ఆపరేషన్ చేపట్టి.. దొంగల ముఠాలో ప్రధాన వ్యక్తి అజయ్ రమేశ్ షిండేను పట్టుకున్నారు. దొంగతనం చేసిన 100 బైకులను స్వాధీనం చేసుకొని.. నెల రోజులపాటు ఆరా తీయగా, ఓ కామర్స్ గ్రాడ్యుయేట్ నేతృత్వంలో నలుగురు

వ్యక్తులు గ్యాంగ్‌గా ఏర్పడి చేస్తున్న తతంగం బయటపడింది. దొంగలించిన వాహనాల్ని దారాశివ్, లాతూర్, బీడ్ జిల్లాల్లో గ్రామస్థులకు అమ్ముతున్నట్టు పోలీసు విచారణలో తేలింది. రహస్య ఆపరేషన్‌లో భాగ